సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 29 । అక్టోబర్ । 2022



మార్కెట్లోకి 'ఆహో అనంతగిరి' కాఫీ పౌడర్

- గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు
- ఎంపీడీవో శ్రీహర్షిత్

8లో



పసుపు..మెరుపు

- ప్రకృతి విధానంలో సాగు
- మార్కెట్లో గిరాకీ
- జిల్లా వ్యాప్తంగా 24వేల హెక్టార్లు

8లో

భూమి కోసం తల్లిపై కత్తితో దాడి

భూమి కోసం కన్నతల్లిపై కత్తితో దాడి చేసిన సంఘటన గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను గ్రామస్తులు 108లో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చినబాబు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

చింతూరు ఐటీడీఏ పీవో రామశేషు బదిలీ



రామశేషు

చింతూరు: స్థానిక ఐటీడీఏ పీవో కే.రామశేషును బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పీవోగా బదిలీ అయ్యారు. గత జూలైలో చింతూరు ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన మూడు నెలల పాటు పీవోగా విధులు నిర్వహించారు.

సబ్ కలెక్టర్‌కు బాధ్యతలు

చింతూరు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు ఐటీడీఏ పీవోగా కూడా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన చింతూరు రెవెన్యూ డివిజన్‌కు స్థానికంగా డివిజన్ కార్యాలయం లేదు. ఈ నేపథ్యంలోనే ఐటీడీఏ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు వీలుగా ప్రస్తుత పీవోను బదిలీ చేయడంతో పాటు సబ్ కలెక్టర్‌కు పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

31న మినీ జాబ్‌మేళా

- కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో నిర్వహణ
- మూడు సంస్థలో 125 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: కొయ్యూరు మండలం శరభన్నపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 31న మినీ జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోహన్ స్పిన్‌టెక్స్, సెంట్రల్ ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ సర్వీసెస్ సంస్థల్లో 125 పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఐదు నుంచి 10వ తరగతి, ఇంటర్, డిప్లమో, ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పొందిన 18–35ఏళ్ల యువతీ యువకులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. లేకున్నా జాబ్ మేళాకు నేరుగా హాజరు కావొచ్చని ఆయన తెలిపారు. హెల్పర్లు, ఆపరేటర్లు, బిజినెస్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ బాయ్స్, బేసిక్ కేర్ టేకర్స్, నర్సింగ్ స్టాఫ్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులు విజయవాడ, విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వారి అర్హతలు, ఎంపిక చేసిన సంస్థ ఆధారంగా నెలకు రూ.7,500 నుంచి రూ.15వేల వరకు వేతనం చెల్లిస్తారని ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత జెరాక్స్ పత్రాలు, ఆధార్, పాన్, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో హాజరు కావాలని కలెక్టర్ కోరారు. వివరాలకు 9491786463, 6302636174 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నిత్యం అప్రమత్తత అవసరం

కొయ్యూరు: నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్ విక్రాంత్ పాటిల్ సూచించారు. శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఆయన సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్‌తో మాట్లాడారు. రక్షణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. పలు అంశాలపై ఆయన ఇక్కడ పోలీసులతో మాట్లాడారు. రక్తదాన శిబిరం నిర్వహించిన కొయ్యూరు సర్కిల్ పోలీసులను ఆయన అభినందించారు.

108లో సుఖ ప్రసవాలు



శిశువుని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంలో ఆడ శిశువుకు జన్మించింది. జి.మాడుగుల మండలం బీరం పంచాయతీ తాడివీధి గ్రామానికి చెందిన ఎస్.రాణీకి నెలలు నిండడంతో శుక్రవారం పురిటినొప్పలు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా గుడలవీధి వద్దకు వచ్చేసరికి ఆడ శిశువుకు జన్మనిచ్చిందని ఈఎన్‌టీ శ్రీను తెలిపారు. ఆ తరువాత తల్లీబిడ్డలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వారు ఇరువురు క్షేమంగానే ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

సీలేరు: దుప్పలవాడ పంచాయతీ కేంద్రానికి చెందిన వంతల మాలతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఏపీ జెన్‌కో సీలేరు భవ్య ఆస్పత్రి సీఎస్‌ఆర్ అంబులెన్స్‌కు ఫోను చేశారు. ఆ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించింది. తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

పంచెకట్టు పండగే వాళ్లకు దీపావళి

దీపావళి అనగానే తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, టపాకాయల వెలుగులు గుర్తుకొస్తాయి. మన్యంలో ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట, దార్రెల, కించాయిపుట్టు పంచాయతీ కేంద్రాల్లో మాత్రం ఈ పండగను భిన్నంగా పంచెకట్టు పండగగా జరుపుకుంటారు. చిన్నారులకు పంచెకట్టి నిర్వహిస్తుంటారు. దీపావళి పండగ అయిన వారంలో అనురాధ నక్షత్రం రోజున దీనిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకున్నారు.

- పండగ అయిన వారంలో అనురాధ నక్షత్రం రోజున నిర్వహణ
- దోషాల నివారణ, మంచి జరుగుతుందని గిరిజనుల నమ్మకం
- చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని విశ్వాసం
- సుజనకోట, దార్రెల, కించాయిపుట్టు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహణ



దార్రెలలో పంచెకట్టు పండుగలో పూజలు చేస్తున్న గిరిజనులు



సుజనకోటలో పంచెకట్టిన చిన్నారులతో గ్రామ గిరిజనులు



చిన్నారులకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట, దార్రెల, కించాయిపుట్టు గ్రామాల్లో పంచెకట్టు పండగ సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో ఎనిమిది సంవత్సరాల నుంచి పదేళ్ల చిన్నారులకు పంచె కట్టి గ్రామంలో ఏర్పాటుచేసిన చావిడి వద్దకు తీసుకువచ్చి మామిడి ఆకులతో తయారుచేసిన తోరణాలు, కిరీటాలతో అలంకరించారు. బిందెలతో తీసుకువచ్చిన నీటికి పసుపు, చేదు ఆనపకాయను కలిపి పువ్వులు, అక్షింతాలతో పూజలు నిర్వహించారు. పంచెకట్టులో పాల్గొన్న చిన్నారులను గునపాల మీద కూర్చొబెట్టి దూప దీపాలతో పూజలు జరిపారు. అనంతరం ఆ నీటితో చిన్నారులకు స్నానాలు చేయించారు. అక్కడకు హాజరైన ప్రతి ఒక్కరిపై ఆ నీటిని జల్లారు. అనంతరం చిన్నారులకు తెల్లటి వస్త్రాలు ధరింపజేశారు. వేదికపై ఉన్న చిన్నారులకు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హారతులిచ్చి ఆశీర్వదించారు.

సందడిగా 'చుట్టం'

పంచెకట్టు పండగలో భాగంగా మహిళలు నిర్వహించిన చుట్టం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలంతా గ్రామంలో ఉన్న పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యుల ఇళ్లకు వెళ్లారు. వారిచ్చిన డబ్బులు, గుమ్మడికాయలు, బియ్యం తదితర సరుకులు తీసుకున్నారు. థింసా నృత్యాలతో చుట్టం కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు.

పండగ ఉద్దేశమిదీ..

పంచె కట్టు కార్యక్రమం 8 నుంచి పదేళ్ల చిన్నారులకు నిర్వహించడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారని గిరిజనుల నమ్మకం. రానున్న కాలంలో ఎటువంటి రోగాలకు గురవ్వరని గిరిజనుల విశ్వాసం. అంతేకాకుండా ఎటువంటి దోషాలున్నా తొలగిపోతాయని, కష్టాలు దరి చేరకుండా సుఖసంతోషాలతో ఉంటారని వారు చెబుతుంటారు.

సుజనకోటలో సందడి

సుజనకోట గ్రామంలో పంచెకట్టు పండగను పూర్వీకుల నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఈ పండగలో పాల్గొనే ప్రతిఒక్కరిపై పూజలు చేసిన నీళ్లను జల్లుతారు. వారు కూడా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంటారని గిరిజనులు భావిస్తుంటారు. పంచెకట్టు పండగ సందర్భంగా సుజనకోట గ్రామంలో సందడి నెలకొంది.

కొన్ని గ్రామాలకే పరిమితం

ఈ పండగను మండలంలోని అన్ని గ్రామాల్లో జరుపుకోవాల్సి ఉంది. మారుతున్న సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం కొన్ని గ్రామాలకే పరిమితమైంది. అయితే సుజనకోట గ్రామస్తులు మాత్రం పూర్వీకుల ఆచార వ్యవహారాలను పాటిస్తూ ఈ పండగను ఏటా ఘనంగా జరుపుకుంటున్నారు.

పూర్వీకులకు ఇచ్చే గౌరవం



పంచెకట్టు పండగ నిర్వహించడాన్ని పూర్వీకులకు గౌరవం ఇచ్చినట్టు భావిస్తుంటాం. ఈ పండగ విశిష్టత భావితరాల వారికి తెలిసేలా నిర్వహిస్తున్నాం. పూర్వీకులు చెప్పినట్టుగా ఈ పండగను తూచ తప్పకుండా నిర్వహిస్తున్నాం. పూజలు చేసిన నీటిని ప్రతిఒక్కరిపై చల్లడం వల్ల రోగాలు దరి చేరవు. ఏటా క్రమం తప్పకుండా జరుపుకుంటున్నాం.

– మండి నాగేశ్వరరావు, సుజనకోట, ముంచంగిపుట్టు మండలం

స్పందనకు వినతుల వెల్లువ



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఇతర అధికారులు

- సత్వరం పరిష్కరించాలి
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం
- 85 అర్జీలు స్వీకరణ

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి.ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ వి. అభిషేక్, డీఆర్వో బి. దయానిధి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి 85 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ స్పందనలో స్వీకరించిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి వెనువెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, అరకు ఈఈ కె. వేణుగోపాల్, పీఆర్ ఈఈ లావణ్య కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ ఈఈలు లీలాకృష్ణ, బాలసుందర్‌బాబు, డీఎల్‌పీవో కుమార్, జీసీసీ డీఎం పార్వతమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ వెంకయ్యపాలెంలో మూతబడిన పాఠశాలను తిరిగి ప్రారంభించాలని జె. ధారకొండమ్మ, సన్యాసిరావు కోరారు.
- మారెడుమిల్లి మండలం దివికోట నుంచి వేట్కూరు వరకు 15 కిలోమీటర్లు, నీలవరం నుంచి గాలిగోపురం వరకు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని వైస్ ఎంపీపీ పి. లత, సర్పంచ్ ఎ. సామిరెడ్డి కోరారు.
- సికిల్‌సెల్ ఎనీమియతో బాధపడుతున్నందున పింఛను మంజూరు చేయాలని జి. మాడుగుల మండలం అరగడపల్లి గ్రామానికి చెందిన జె. నిర్మల వినతిపత్రం అందజేసింది.
- సాగులో ఉన్న అటవి భూములకు పట్టాలు మంజూరు చేయాలని చింతపల్లి మండలం అంజలి శనివారం గ్రామానికి చెందిన వెంకటరావు వినతిపత్రంలో కోరారు.
- కొయ్యూరు మండలం శరభన్నపాలెం పంచాయతీ నిమ్మగెడ్డకు చెందిన గూడెపు శివశంకర్ ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరారు.

గ్రీవెన్స్ సమస్యలకు తక్షణ పరిష్కారం

అధికారులకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సూచన



బొజ్రాయిగూడెం పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాలిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: గ్రీవెన్స్ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని కోతులగుట్టలో ఇందిరాక్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజలనుంచి పలు విజ్ఞప్తులు స్వీకరించి వాటిని తక్షణం పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పోలవరం భూసేకరణ, ఇండ్ల సర్వేకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడుతున్న నేపథ్యంలో రెవెన్యూ పరమైన సమస్యలను, పంచాయతీ రాజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలవరం పునరావాసం కింద బొజ్రాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజనేతరులకు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో ఒక్కో కుటుంబానికి ఐదు సెంట్లు చొప్పున ఇచ్చిన ఇంటి స్థలం పట్టాలను 19 మందికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, జగ్గవరం సర్పంచ్ కారం పార్వతి, తహసీల్దార్ కె అనసూయ, ఇన్‌చార్జి ఎంపీడీవో ఫణీంద్రం, సొసైటీ అధ్యక్షులు నోముల కొండలరావు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటిపూర్ణానందం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం అధికారులతో సమీక్షించారు. స్పందన వినతులను పరిష్కరించిన వెంటనే వాటి వివరాలను స్పందన పోర్టల్‌లో అప్‌లోడు చేయాలన్నారు.

గైర్హాజరైతే చర్యలు: ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

ఐటీడీఏలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అనుమతులు లేకుండా అధికారులు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. ఎలాంటి పనులున్నా తప్పనిసరిగా కలెక్టర్ వద్ద ముందస్తు అనుమతులు పొందాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని నిర్లక్ష్య ధోరణితో చూడవద్దన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా వెనుకబడి ఉందని, ఆయా పనులన్నింటిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. వచ్చే సోమవారం ప్రత్యేక గ్రౌండింగ్ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోజుకు పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ, విద్యుత్, హౌసింగ్ ఇంజనీర్లంతా గ్రౌండింగ్ మేళాకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. జీసీసీ గ్యాస్ సరఫరా చేయాలని, లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లేనిపక్షంలో జీసీసీ నుంచి గ్యాస్ విభాగాలు, పెట్రోల్ బంకులను ఐటీడీఏ ఆధీనంలో తీసుకుంటామని పీవో హెచ్చరించారు. నవంబర్ నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు శీతాకాలం కావడంతో వర్షాల ప్రభావం ఉండనందున అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రతి మూడు నెలలకు వార్డెన్లను మార్చాలని ఆదేశించినప్పటికి కొన్ని పాఠశాలల్లో అమలు కాలేదన్నారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీవో ఆదేశించారు. సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డీఆర్వో బి.దయానిధి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణలో పీఈటీల పాత్ర కీలకం

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్



డీఈవో రమేష్‌ను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: పాఠశాలల్లో విద్యార్థుల క్రమశిక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. స్థానిక పీఎంఆర్‌సీ భవనంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ మొదటి వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులంతా విద్యార్థుల క్రీడా ప్రమాణాల మెరుగుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ఆయన తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాంగి సూరిబాబు మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లోను విద్యార్థుల క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో వ్యాయామంతో పాటు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా క్రీడల అధికారి జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ అన్ని మండలాల్లోను క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం డీఈవోను వ్యాయామ ఉపాధ్యాయులంతా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ కోఆర్డినేటర్ సోమెలి సింహాచలం, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సింహాచలం, ఇతర ప్రతినిధులు సద్దు, కొండబాబు, భూపతిరాజు, సుధారాణి, కృష్ణకుమారి, పూర్ణరాజు, రాజుబాబు, బాలన్న, రాజులమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పూర్తిస్థాయి తర్ఫీదు

- సెట్విస్ సీఈవో నాగేశ్వరరావు
- జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెట్విస్ సీఈవో నాగేశ్వరరావు

పాడేరు రూరల్: నూతనంగా నెలకొల్పనున్న జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌ల ద్వారా అన్ని రకాల క్రీడల్లో పూర్తిస్థాయిలో తర్ఫీదు ఇస్తామని సెట్విస్ సీఈవో నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న స్పోర్ట్ క్లబ్లలపై అవగాహన కల్పించారు. ఆసక్తిగల విద్యార్థులకు క్రీడల్లో స్థానికంగా శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో ఎ. జగన్మోహన్‌రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రసూల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి. రమేష్‌కుమార్, జి. గౌరీశంకర్, పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

- మొదటి విడతలో 61, రెండో విడతలో 49 వందన్ వికాస్ కేంద్రాలు
- రంపచోడవరం పీవో సూరజ్ గనోరే

8లో

రక్తదానం ప్రాణదానంతో సమానం





చింతూరులో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, కొయ్యూరులో రక్తదానం చేస్తున్న సీఐ, ఎస్‌ఐలు

చింతూరు: ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది, గ్రామస్తులతో సహా 42 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఈ42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకరరావు, సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ యాదగిరి, వైద్యులు విశ్వచైతన్య, శ్రీహర్ష పాల్గొన్నారు.

పోలీసుల శిబిరానికి విశేష స్పందన

కొయ్యూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పోలీసులు శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు లోకేష్‌కుమార్, రాజారావు ఈ శిబిరాన్ని పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించారు. సీఐ, ఎస్‌ఐలతో కలిపి 65 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రక్తదానం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుందన్నారు. విశాఖకు చెందిన ఫస్ట్ బ్లడ్‌బ్యాంకు వైద్యులు నగేష్, ,బ్లడ్ బ్యాంకు ఇంచార్జీ శ్రీనివాస్ రక్తదానం చేశారు. వీరిలో మహిళా పోలీసులు, ఏపీఎస్పీకి చెందిన సిబ్బంది ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కొంతమంది నేతలు రక్తదానం చేశారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు



నీటిగుంతలో గంబూషియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

చింతూరు: మలేరియా వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు గుర్తించిన ప్రదేశాల్లో శుక్రవారం గంబూషియా చేపలను వదిలినట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య చెప్పారు. మోతుగూడెం పీహెచ్‌సీ పరిధిలోని పొల్లూరు, సుకుమామిడి, గొందిగూడెం, దబ్బగూడెం, తులసిపాక పీహెచ్‌సీ పరిధిలోని తులసిపాక, ఎర్రగొండపాకల గ్రామాల పరిధిలోని నీటి నిలువ గుంతల్లో చేపలను విడిచిపెట్టినట్టు ఆయన తెలిపారు. ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని చిడుమూరు, గంగన్నమెట్ట, రింగల, ఏడుగురాళ్లపల్లి, కాటుకపల్లి, చుక్కలపాడు గ్రామాల్లో, లక్ష్మీపురం నెల్లిపాక, గౌరిదేవిపేట, కూటూరు, రేఖపల్లి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో సుమారు 20 వేల గంబూషియా చేపలను జార విడిచినట్టు డాక్టర్ పుల్లయ్య చెప్పారు. గంబూషియా చేపల కారణంగా మురికి గుంతల్లో దోమల గుడ్లు, లార్వా దశలో దోమల అభివృద్ధి జరగకుండా అరికడతాయన్నారు.

భూమి కోసం తల్లిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న తల్లి రఘుపతి

గంగవరం: భూమి కోసం కన్నతల్లిపై కత్తితో దాడి చేసిన సంఘటన గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో శుక్రవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు స్థానిక ఎస్‌ఐ చినబాబు శుక్రవారం తెలిపిన వివరాలివి. గంగవరం మండల నెల్లిపూడి గ్రామానికి చెందిన బొట్టా రఘుపతి, నలుగురు కుమారుల మధ్య చాలా కాలంగా భూ వివాదం ఉంది. కోర్టులో కేసు కూడా నడుస్తోంది. బొట్టా రఘుపతి భర్త బొట్టా చిన్నిరాజులు మృతి చెందడంతో నలుగురు కుమారులు భూమిని పంచుకున్నారని, అయితే బొట్టా రఘుపతికి చెందిన ఎకరంన్నర భూమి కూడా పంచాలని కొడుకులు డిమాండ్ చేస్తూ దీనిపై కోర్టులో కేసులు వేసుకున్నారని ఎస్‌ఐ తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తల్లి తన భూమిలో ఉన్న ఇనప కంచెను తొలగిస్తుండగా రెండో కొడుకు బొట్టా చంద్రరావు తల్లి రఘుపతితో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో చంద్రరావు కత్తితో తల్లిపై దాడి చేయగా ఆమె తలకు తీవ్ర బలమైన గాయం అయింది. గ్రామస్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె అక్కడ వైద్య సేవలు పొందుతోందని ఎస్‌ఐ తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చినబాబు తెలిపారు.

ఆదివాసీ ఐక్యత మహాసభ రేపు

వై.రామవరం: మండలంలోని కె.యర్రగొండ గ్రామంలో ఆదివాసీ ఏడు ఉపతెగల ఐక్యత మహాసభ నిర్వహించనున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా సభలో ఆదివాసీల సమస్యలు, హక్కుల సాధన తదితర అంశాలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. సభకు ఆదివాసీ ఉద్యోగులు, ఆదివాసీ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో అన్ని వర్గాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పసుపు..మెరుపు



పెదబరడ పంచాయతీ సరిపురం గ్రామంలోని సాగులో ఉన్న పసుపు పంట

- ప్రకృతి విధానంలో సాగు
- మార్కెట్‌లో గిరాకీ
- జిల్లా వ్యాప్తంగా 24వేల హెక్టార్లలో పంట

జిల్లాలో పసుపు సాగు (హెక్టార్లలో)

మండలం	విస్తీర్ణం
ముంచంగిపుట్టు	1208
డుంబ్రిగుడ	502
అరకులోయ	35
కొయ్యూరు	32
పాడేరు	1632
జి.మాడుగుల	6400
జీ.కె.వీధి	5878
చింతపల్లి	5835
పెదబయలు	1875
హుకుంపేట	798
వై.రామవరం	50
మారేడుమిల్లి	10

అనంతగిరి: ఏజెన్సీ వ్యాప్తంగా పసుపు సువాసన వెదజల్లుతోంది. మన్యం పసుపునకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో పసుపు విస్తారంగా పండిస్తున్నారు. కొండపోడుతో పాటుగా పల్లంగా ఉన్న భూముల్లో దిగుబడులు బాగుండడంతో గిరిజన రైతులు సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో 12 మండలాల్లో పసుపు పంటను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా జి.మాడుగుల, జీకె.వీధి, చింతపల్లి, పెదబయలు, పాడేరు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకులోయ, కొయ్యూరు, హుకుంపేట, వై.రామవరం, మారేడుమిల్లి మండలాల్లో 24,255 హెక్టార్లలల్లో పసుపు సాగు చేస్తున్నారు.

అంతర పంటగా

పెట్టుబడి తక్కువగా ఉండడంతో అధిక ఆదాయం వస్తుండడంతో అంతర పంటగా గిరిజన రైతులు పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని 10 కావిడ్ల వరకు పసుపు నాటితే 20 నుంచి 25 కావిడ్ల దిగుబడి వరకు వస్తుందని గిరిజన రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని, దిగుబడులు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగు

ఏజెన్సీ వ్యాప్తంగా సేంద్రియ పద్ధతిలోని గిరిజన రైతులు పసుపు సాగు చేస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందులను వాడకుండా, ప్రకృతి వ్యవసాయంలో పండిస్తుండడంతో కర్కుమిన్ కంటెంట్ 5శాతం ఉంటుందని హార్టీకల్చర్ అధికారులు చెబుతున్నారు. దీంతో మైదాన ప్రాంతాల్లో ఏజెన్సీలో పసుపుకు మంచి డిమాండ్ ఉంది.

రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం

ఏజెన్సీ వ్యాప్తంగా పసుపు పంటను సాగు చేస్తున్న రైతులకు ఐటీడీఏ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రోత్సహించే విధంగా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రైతు భరోసా సొమ్ము సకాలంలో అందుతుండడంతో రైతులు వరి, రాజ్‌మా తదితర పంటలతో పాటు అంతర పంటలపై దృష్టి సారిస్తున్నారు. వాణిజ్య పంటలపై సాగు చేపట్టేందుకు అధికారులు రైతులకు సలహా, సూచనలందిస్తున్నారు.

దేశీయ పసుపు సాగు

ఎప్పటి నుంచో దేశీయ పసుపునే పండిస్తున్నాం. దీంతో పసుపు చాయా రావడంతో లాభాలు వస్తున్నాయి. ప్రభుత్వం గిరిజన రైతులను ప్రోత్సహించే విధంగా దేశీయ పసుపు కొమ్ములను పంపిణీ చేస్తే, మరింత విస్తీర్ణంలోని సాగు చేసుకుని ఆర్థికంగా ఎదుగుతాం. మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరుతున్నాం.

–కృష్ణమోహన్, రైతు, బంగారుమెట్ట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

సాంకేతిక మద్దతు

పసుపు సాగు చేసుకునే రైతులకు మద్దతును అందిస్తున్నాం. ఎటువంటి తెగుళ్లు వంటివి సోకినా వెంటనే నివారణకు చర్యలు సూచిస్తున్నాం. ఎప్పటికప్పుడు పంటను హార్టీకల్చర్ అధికారులు పరిశీలించి సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– రమేష్, జిల్లా హార్టీకల్చర్ అధికారి

మార్కెట్లోకి 'ఆహో అనంతగిరి' కాఫీ పౌడర్

అనంతగిరి: కాఫీ రైతులకు మేలు జరిగేలా 'ఆహో అనంతగిరి' అనే బ్రాండ్ ద్వారా పర్యాటక ప్రాంతాల్లో కాఫీ గింజలు, పౌడర్, తదితర అటవీ ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో శ్రీహర్షిత్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అనంతగిరి, ఎగువశోభ పంచాయతీల్లో కమలపురం జామిగుడ, భీసుపురం గ్రామంలోని గిరిజన కాఫీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతగిరి, ఎగువశోభలో 1771 ఎకరాల్లో కాఫీ సాగు జరుగుతుందని చెప్పారు. సుమారు 632 మంది కాఫీ రైతులు ఉన్నారని వీరంతా సొసైటీగా ఏర్పడి కాఫీ పౌడర్, ఇతర అటవీ ఉత్పత్తుల అమ్మకాలు సాగిస్తే ఆర్థికంగా ఎదిగేందుకు అస్కారం ఉంటుందన్నారు. దీనిపై గిరిజన కాఫీ రైతులు అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఎగువశోభ సచివాలయ కార్యదర్శి రమేష్, సిబ్బంది కుమారి, నవీన్, చంద్రమౌళి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి

చైతన్య స్రవంతి డైరెక్టర్ మాలిని



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన చైతన్య స్రవంతి, రోటరి క్లబ్ ప్రతినిధులు

పాడేరు రూరల్: ఆదివాసీ యువతతో పాటు మహిళలంతా నైపుణ్య శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధితో సాధించవచ్చని చైతన్య స్రవంతి డైరెక్టర్ ఎం. మాలిని అన్నారు. రోటరీ క్లబ్, విశాఖ పోర్టు సహకారంతో మినుములూరు చైతన్య స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలల పాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు యూఎస్ శర్మ, కార్యదర్శి సుదీర్ చౌదరి, ప్రతినిధులు జి. విశ్వనాథ్, వర్మ, సునీత, దీప, శరత్, ఆర్క్ సంస్థ ప్రతినిధి ప్రసాద్, బాలల హక్కుల కార్యకర్త బి. వెంకటహరి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి చర్యలు

ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని మహిళా సంఘ సభ్యులు చిన్న చిన్న వ్యాపారులు తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. పీవో తన చాంబర్‌లో శుక్రవారం వెలుగు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని మహిళా సంఘాల సభ్యులు, వందన్ వికాస్ కేంద్రాలకు సంబంధించిన సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొదటి విడతలో 61 వందన్ వికాస కేంద్రాలు, రెండో విడతలో 49 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వికాస కేంద్రా సభ్యుల ఆధార్ కార్డులు , బ్యాంక్ అకౌంట్లు పూర్తి చేసి , వికాస కేంద్రాల ద్వారా చేపట్టే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఒక్కో వీడీవీకెకు రూ. 15 లక్షలు మంజూరవుతుందన్నారు. వాటితో అటవీ ఉత్పత్తులు సేకరించి, మార్కెటింగ్ చేయాలని వెలుగు అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో 11 హెట్ హబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ చేయాలన్నారు. వందన్ వికాస కేంద్రం సభ్యుల నుంచి వాటా కింద వెయ్యి రూపాయలు చెల్లించాలని సూచించారు. వెదురు బొంగులతో కొవ్వొత్తులను తయారు చేసి మార్కెట్ చేయాలన్నారు. వెలుగు ద్వారా సేకరించిన ఆరుటున్నల చింతపండును ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. వాటర్ షెడ్ పథకంలో చేపట్టిన పనులపై పీవో సమీక్షించారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరావు, అపర్ణ, పరమేశ్వరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో ఆవు పెయ్యిని బలిగొన్న పులి



మృతి చెందిన ఆవుపెయ్యి



పొలంలో పులి పాదముద్ర

అనకాపల్లి టౌన్: మండలంలో దిబ్బపాలెం గ్రామంలో గురువారం పులి కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఆళ్ల రమణ పొలంలో ఆవు, పెయ్యిలపై దాడి చేసింది. రమణ శుక్రవారం ఉదయం తన పొలంలోకి వెళ్లి చూడగా తీవ్ర రక్త స్రావంతో ఆవు పెయ్యి మృతి చెంది కనిపించింది. ఆవు స్వల్ప గాయాలతో పడి ఉంది. దీంతో పొలంలో పులి సంచరించిందని భావించి విషయాన్ని ఫారెస్ట్ అధికారి పి.వి.రవివర్మ, రూరల్ ఎస్‌ఐ నరసింగరావులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పులి పాదముద్రలను గుర్తించారు. గ్రామంలో కొండల మీదుగా చోడవరం మండలం ముద్దుర్తి గ్రామంలోకి పులి ప్రవేశించినట్టు ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

తండ్రికి కుమార్తె అంత్యక్రియలు



తండ్రి మృత దేహానికి అంత్య క్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

ఎస్.రాయవరం: తండ్రికి చితికి తలకొరివి పెట్టి కన్న కూతురు రుణం తీర్చుకుంది. లింగరాజుపాలెంగ్రామానికి చెందిన నాళం చినబ్బాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం గ్రామంలో చినబ్బాయి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు. వారిలో చివరి కుమార్తె విజయ తండ్రి చితికి తలకొరివి పెట్టి అంత్య క్రియలు పూర్తి చేసింది.

విద్యాధన్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

మాడుగుల రూరల్: విద్యాధన్ పాన్ ఇండియా ఉన్నత స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సరోజిని దామోదర్ గ్రూప్ ప్రోగ్రామ్ సమన్వయకర్త ఉమాశంకర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ మెదటి సంవత్సరం చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో 60 శాతం అంతకన్నా ఎక్కువ లేదా, 6 సిజిపిఏ సాధించిన దివ్యాంగ విద్యార్థులు దీనికి అర్హులన్నారు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం నాలుగు లక్షల రూపాయల లోపు వుండాలని, వికలాంగ ధ్రువీకరణలో 40 శాతం లేదా అంతకు మించి వికలాంగత్వం వున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారు ఎంచుకున్న పై చదువులు నిమిత్తం రూ.15000 నుంచి రూ. 60,000 వరకు స్కాలర్ షిప్ పొందుతారని తెలిపారు. విద్యార్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.విద్యాధన్. ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో నవంబర్ 15 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలు కోసం 8367751309 నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం



ఏలేశ్వరం రహదారి మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..

రాజవొమ్మంగి: గొంటువానిపాలెం నుంచి రమణయ్యపేట వరకు గల సుమారు 10 కిలోమీటర్ల నిడివి గల ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మరమ్మతు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి వివరాలు అందజేశారు. ఈ రహదారి మెరుగుపడితే మన్య ప్రాంతం రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, అడ్డతీగల, కొయ్యూరు మండలాల ప్రజల రహదారి రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ రహదారి పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారింది. సమస్యను జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి ఉమ్మడి గోదావరి జిల్లాల జిల్లా పరిషత్ సమావేశంలో పలుమార్లు ప్రస్తావించడంతో ఉన్నతాధికారులు స్పందించిన సంగతి తెలిసిందే. సమస్యపై పలుమార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై యంత్రాంగం స్పందించి, రహదారి మరమ్మతుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు రోడ్డు మరమ్మతుకు రూ. 2.24 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు జ్యోతి తెలిపారు. రహదారి పనులు ప్రారంభం కానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కిరాణా షాపు దగ్ధంపై ఫిర్యాదు



దగ్ధమైన కిరాణా షాపు

నక్కపల్లి: జాతీయ రహదారి పక్కన మనబానవానిపాలెం జంక్షన్లో గురువారం రాత్రి కిరాణా దుకాణం దగ్ధమైంది. తన షాపు దగ్ధం అవుతున్నట్టు రాత్రి 10 గంటలు దాటిన తర్వాత హైవే పోలీసు సిబ్బంది షాపు యజమానికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వెంటనే వెళ్లి చూసుకునే సరికి షాపులో ఉన్న వస్తువులు, సరుకులు కాలి బూడిదయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.10 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. తన షాపు దగ్ధం కావడం వెనుక అనుమానాలు వ్యక్తం చేస్తూ బాధితుడు గొర్ల శేషుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శేషు కొద్ది కాలంగా ఇక్కడ పాన్ అండ్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇతనికి సహాయకునిగా ఇతని మేనల్లుడు మనబాల శ్రీను ఉంటున్నారు. ఈ నెల 24వ తేదీన తన మేనల్లుడు, పాయకరావుపేటకు చెందిన అల్లు చిన్న అనే వ్యక్తితో ఫోన్‌లో వాదులాడుకున్నారని, అదే రోజు సాయంత్రం ఏడుగంటలకు అల్లుచిన్నతో పాటు, మరో వ్యక్తి వచ్చి షాపులో ఉన్న శ్రీనుతో గొడవ పడ్డారని శేషు తెలిపాడు. తాను ఇద్దరినీ మందలించగా ఉక్రోషం తట్టుకోలేక అల్లు చిన్నా నీ సంగతి కూడా తేలుస్తాను, షాపు ఎలా నిర్వహిస్తావో చూస్తానంటూ హెచ్చరించాడని, ఈ ఘటన జరిగిన రోజు రాత్రే తన షాపు దగ్ధమయిందని తెలిపాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బాధితుడు శేషు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భారీ ఎత్తున సారా పులుపు ధ్వంసం



వంతాలలో పులుపును ధ్వంసం చేస్తున్న మహిళా పోలీసులు




సారాతో దొరికిన వ్యక్తులు

కొయ్యూరు: రేవళ్ల, మంపలో నాటుసారా అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేశామని మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారు చేసినా లేదా విక్రయించినా చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఎక్కడైతే సారా తయారు చేస్తున్నారో ఆ ప్రాంతాలను గుర్తించి దాడులు చేస్తామన్నారు. సారా ఎవరు అమ్మినా లేదా తయారు చేసినా చట్టప్రకారం నేరస్తులు అవుతారని చెప్పారు. సారాలో కలిపే రసాయనాలు మూలంగా ఆరోగ్యం పాడైపోతుందని చెప్పారు.

జి.మాడుగుల: నాటుసారా తయారీ, విక్రయాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మహిళా పోలీసులు కల్పన,నూకరత్నం, కోటేశ్వరి, ఉమా హెచ్చరించారు. మండలంలో వంతాల పంచాయతీ కేంద్రంలో శుక్రవారం సారాబట్టీపై దాడి చేసి 1000 లీటర్లు పలుపును ధ్వంసం చేశారు.

పాయకరావుపేట: పట్టణ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 2500 లీటర్లు సారా తయారీకి ఉపయోగించే బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్ఈబి సీఐ పి.టి.వి. కుమార్ తెలిపారు. పట్టణ పరిధిలో ధారకొండలో దాడులు నిర్వహించి 1500 లీటర్ల సారా పులుపును, పి.ఎల్.పురం గ్రామ పరిసరాల్లో దాడులు నిర్వహించి మరో 1000 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు సీఐ తెలిపారు.

చీడికాడ: చీడిపల్లి పంచాయతీ ఎస్.కొత్తూరు రాతి చెరువు సమీపంలో అర్జునగిరి సచివాలయం మహిళా పోలీసు మనీసా ఆధ్వర్యంలో శుక్రవారం సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. నాలుగు పెద్ద డ్రమ్ములతో సారా తయారీకి సిద్ధంగా వుంచిన సుమారు వెయ్యి లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.



క్లుప్తంగా

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం



భూ రీసర్వేను ప్రారంభిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూరీసర్వేను చిన్నకాగువలసలో సర్పంచ్ సాయిత, వైఎస్సార్‌సీపీ నాయకులు బాక సింహాచలం, అశోక్‌కుమార్ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు నర్సింగ్, సునీల్, వీఆర్వో శెట్టి రవి, సర్వేయర్ సంగీత, సిబ్బంది గోపాలకృష్ణ తదితరులున్నారు.

ఈఎంటీలకు స్మార్ట్‌ఫోన్లు అందజేత



స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న ఈఎంఈ గంగాధర్

డుంబ్రిగుడ: ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీలకు ప్రభుత్వం అందజేసిన స్మార్ట్‌ఫోన్‌లను ఈఎంఈ గంగాధర్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన వారికి ఆస్పత్రికి తరలించేందుకు ఫీడర్ అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం అందించిన స్మార్ట్‌ఫోన్‌లను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనులకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు.

రుణ యాప్‌లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ పీవో

అరకులోయ రూరల్: రుణయాప్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అరకులోయ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో విజయలక్ష్మి అన్నారు. పెదలబుడు పంచాయతీ పెదలబుడు, గరుడగుడ, గంజాయిగుడ, పిట్టమామిడివలస గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించి రుణయాప్‌లపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రుణయాప్‌లతో అనర్థాలుంటాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, సారాకు దూరంగా ఉండాలన్నారు.ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. యూనిసెఫ్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు నాగబాబు, అనిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డు అప్‌డేట్ తప్పనిసరి

గంగవరం: ఆధార్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా తమ ఫోన్ నంబర్, బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేసుకోవాలని ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలో చాలా మంది ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి ఆధార్‌కు ఫోన్ నంబర్, బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేయకపోవడంతో పథకాల లబ్ధిని కోల్పోతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఖచ్చితంగా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. మండలంలో మూడు ఆధార్ సెంటర్లు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గూడెంకొత్తవీధి: దామనాపల్లి పంచాయతీలోని మాడెం గ్రామంలోని పారిశుధ్య పనులను సర్పంచ్ కె.రామకృష్ణ శుక్రవారం పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యదర్శి కళ్యాణ్ కృష్ణ పాల్గొన్నారు.

మ్యుటేషన్‌పై అవగాహన

అనంతగిరి: చిలకలగెడ్డలోని వీఆర్వో శంకరరావు అధ్యక్షతన గిరిజనులకు మ్యుటేషన్‌పై అవగాహన కార్యక్రమ శుక్రవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ తాత, తండ్రుల పేరిట ఉన్న భూములను మ్యుటేషన్ ద్వారా మార్చుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పాడేరు, ముంచంగిపుట్టు, కూనవరంలో గడప గడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలకు ఘన స్వాగతం



దబ్బాపుట్టులో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గిరిజనులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ఏనుగురాయిలో సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పాడేరు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, గడప వద్దకే పథకాలు అందుతుండడంతో అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గుత్తులపుట్టు సచివాలయం పరిధిలోని గుత్తులపుట్టు, వంతాల గుమ్మి, దబ్బాపుట్టు, పామరెల్లి, జి.కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 382 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సకాలంలో, సక్రమంగా పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు చెప్పారు.

గిరి గ్రామాలాభివృద్ధికి ప్రాధాన్యం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను గ్రామ సచివాలయాలకు విడుదలవుతున్న రూ.20లక్షలతో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, సర్పంచులు రాంబాబు, నీలకంఠం, పార్వతమ్మ, చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు సన్యాసయ్య, రామకృష్ణ పాత్రుడు, చిట్టమ్మ, జిల్లా వ్యవసాయ మండలి సలహా కమిటీ చైర్‌పర్సన్ సరస్వతి, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, మండల బూత్ మేనేజర్ సుశీల, సూరిబాబు, కన్నా పాత్రుడు, రామ సత్యవతి, బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల హృదయాల్లో సీఎం జగనన్నకు చెరగని స్థానం : అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: పేదల హృదయాల్లో సీఎం జగనన్న చెరగని స్థానం సంపాదించుకున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రంతో పాటు గాదేలబురుగు, నడుమూరు, అల్లమల్ల్ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 277 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించి, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. దీంతో ప్రజలు, లబ్ధిదారులు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నకు తిరిగి ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో ఎస్.కిరణ్‌కుమార్, ఎంఈవో చెల్లయ్య, ఏపీవో సూరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ లీలాకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌లు నరసింగరావు, నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, కమల, నోబ్ఫే, నాయకులు జగబందు, జయదేవ్, గాసిరావు, మత్స్యలింగం, సోలెమాన్, కొండలరావు, దాసు, పులిరాజు, మణి, తిరుపతి, బాలరాజు, అప్పారావు, ప్రసాద్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, అనేక పథకాలు అమలుచేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని జగ్గవరం సచివాలయంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. జగ్గవరం, జగ్గవరం కాలని, కోతులగుట్టలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, తద్వారా లబ్ధి పొందుతున్న గిరిజనులు, గిరిజనేతరులతో మాట్లాడారు.సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. పథకాల అమలుపై ఆరాతీశారు. ఆయా గ్రామాల్లో 380 గడపలను సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు కూడా ఈ పథకాలను పొందుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం ఎంతవరకు సబబో వారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భీమవరంలో రామాలయం సమీపంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు విజయ, మేరుకులం కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, వ్యవసాయ సలహా మండల చైర్మన్ పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, సర్పంచ్ పార్వతి, తహసీల్దార్ అనసూయ, ఎంపీడీవో ఫణీంద్ర, ఎండోమెంట్ చైర్మన్ హరనాథ్, మండల పార్టీ కన్వీనర్ కోటేశ్వరరావు, నాయకులు గుజ్జాబాబు, భరతమూర్తి, మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కార్యదర్శి సురేష్, సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పెద్దబిడ్డ పంచాయతీలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి



ఇందుకూరుపేటలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ మురళీ తదితరులు

అనంతగిరి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం జరుగుతుందని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు.

పెదబిడ్డ పంచాయతీలోని ఆరు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ పెంటమ్మతో కలిసి ఎంపీపీ నీలవేణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వివరించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ స్వామి, నాయకులు రామనాయుడు, శ్రీను, ప్రసాద్, గంగులు, కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేటలో రౌతు వారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కుంజం మురళీ శుక్రవారం పరిశీలించారు. మండలంలో దేవారం, శరభవరం, ఇందుకూరు, ఇందుకూరుపేట గ్రామాల్లో రూ.26లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. బాబ్జి, మురళీకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో రోడ్లు, డ్రైనేజీ పనులకు సర్పంచ్ నీలకంఠం శుక్రవారం శంకుస్థాపన చేశారు. వైస్ సర్పంచ్ సుక్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మణి, నాయకులు జగబందు, సులేమాన్, బుద్ధ, భగత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం



పట్టభద్రులను ఓటర్లును నమోదు చేయిస్తున్న మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ఆనంద్

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఆనంద్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో వెళ్లి పట్టభద్రులను గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రామారావు, నాయకులు నర్సింగ్, సింహాచలం, తుమ్‌నాథ్, గోపి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అరమ పంచాయతీలో పట్టభద్రులకు ఓటరు నమోదు దరఖాస్తులను మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బంగురు శాంతి శుక్రవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల ద్వారా ధ్రువీకరించిన ఓటరు దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ఎటపాకలో రక్తదానం చేస్తున్న యువకులు

రంపచోడవరం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని రంపచోడవరం పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్టు ఎస్ఐ మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో పలువురు పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారన్నారు. రక్తదానంతో ప్రాణదానం కలుగుతుందన్నారు.

ఎటపాక: ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పార్థసారథి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఎస్ఐ పార్థసారథి మాట్లాడుతూ యువత ప్రతీ ఒక్కరు సేవాభావం అలవర్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

తవ్వకాల అనుమతుల రద్దుకు వినతి

అరకులోయ రూరల్: దాబుగుడ కొండలో తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ దొన్నుకు గిరిజన సంఘం నాయకులు, పలువురు గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ దొన్నుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రామన్న, రామారావు మాట్లాడుత బాక్సైట్ తవ్వకాల కోసం 2019లో గ్రామసభ తీర్మానంలో స్థానికులు ఒప్పుకున్నట్టు కొంతమంది దొంగ సంతకాలు సృష్టించారని, దీనిపై విచారణ చేయాలని కోరారు. కొండ తవ్వకంతో వ్యవసాయ భూములకు నష్టం జరుగుతుందని, అనుమతులు రద్దు చేయాలని కోరారు. గ్రామస్తులు అప్పన్న, భీమన్న ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

చింతపల్లి రూరల్: మండలంలోని 2760 ఎకరాలకు గాను 690 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశామని ఏవో కన్నబాబు చెప్పారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ రాజ్‌మా, వలిసె పంటలకు సంబంధించి ఆర్‌బీకేలో రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు.

త్వరితగతిన పనులు

చింతూరు: స్థానిక డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు శుక్రవారం పరిశీలించారు. పనుల జాప్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీతయ్య, చందు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాల అమలుపై న్యాయ పోరాటం

పాడేరు రూరల్: అవినీతి, హక్కులు, చట్టాల అమలుపై న్యాయ పోరాటం చేస్తామని సిటిజన్ రైట్స్ అవగాహన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. రాంబాబు అన్నారు. పాడేరు జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.శివనాయక్, ప్రధాన కార్యదర్శిగా అప్పారావు, కోశాధికారిగా చంటిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కృష్ణతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి గుర్తింపు కార్డులను అందజేస్తామని రాంబాబు చెప్పారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదన్

గూడెంకొత్తవీధి: లంకపాకల గ్రామంలోని ఏవో మధుసూదన్ శుక్రవారం పర్యటించి, సాగులో ఉన్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెగుళ్ల నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పలు పంటలకు ఆకుముడత పురుగు ఆశించినట్టు గుర్తించామన్నారు. రైతులు వరి పొలాల్లో అగ్గితెగుళ్ల నివారణకు ట్రిక్లోజోలి 0.6 గ్రాముల ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సాగులో మెలకువలు తెలుసుకోవాలన్నారు. వీఏఏ బలరాం, వీహెచ్ఏ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ కృష్ణారెడ్డి శుక్రవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయం పరిధిలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. పంచాయతీలో వీధి కుళాయిలు ఏర్పాటు, వీధిలైట్లు ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయం దృష్టికి వచ్చిన సమస్యలు సకాలం పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో అమలు జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీపీ పరిశీలించారు. భవన నిర్మాణ విషయాలను హెచ్ఎం సత్యనారాయణతో అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

వీఆర్ పురం: సున్నంవారిగుడెం, సోములగుడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరని, ప్రభుత్వం స్పందించి నియమించాలని కోరారు. అనంతరం సభ్యులతో మాట్లాడుతూ ఏటీఏ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వెంకట్రావు, రామయ్య, కన్నారావు, సుబ్బయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామాల్లో నాగులచవితి వేడుకను భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. దీపావళి పండగ అనంతరం నాలుగోరోజు నాగులచవితి పండగ జరుపుకోవడం గ్రామస్తుల ఆనవాయితీ. ఈ సందర్భంగా పొలాల్లోని పుట్టల వద్ద నువ్వుల చిమ్మిలి, గుడ్లు, సమర్పించి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు టపాసులు కాల్చి సందడి చేశారు. ఇంటిల్లిపాది సహపంక్తి భోజనాలు చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



పాస్టర్లకు ఆర్థిక సాయమందిస్తున్న విజయరాజు, సంజీవ్‌కుమార్

అరకులోయ రూరల్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, సువార్తలతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని లూథరన్ మిషన్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మాడగడ పంచాయతీ బెంజిపూర్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్లతో శుక్రవారం సమావేశం జరిగింది. కార్యక్రమంలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట మండలాలకు చెందిన సుమారు 50 మంది పాస్టర్లు పాల్గొన్నారు. వారికి బైబిల్ మిషన్ నిర్వాహకుడు విజయరామరాజు చేతుల మీదుగా ఆర్థికసాయం అందించారు. దముకు, జీలుగుపుట్టు, పడలపుట్టు, శిరసవలస, పైనంపాడు, ఎగువసోభ, అరకులోయ, బెంజిపూర్, కొత్తురు, రాళ్లమత్స్యపురం తదితర గ్రామాల మహిళలకు చీరలు, రగ్గులు పంపిణీ చేశారు.

55 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య భద్రతపై సూచనలిస్తున్న డాక్టర్ భాస్కర్

అడ్డతీగల: గొంటువానిపాలెంలో ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 104 వైద్యుడు పి.నాగేశ్వరరావుతో కలిసి గ్రామంలో ఐదుగురు గర్భిణులతో పాటు 55 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కురిడిలో పారిశుధ్య పనులు



రిక్షా ద్వారా చెత్త తొలగిస్తున్న దృశ్యం

డుంబ్రిగుడ: కురిడి పంచాయతీలో చెత్త తొలగించేందుకు రిక్షా వినియోగంలో ఉన్నాయని ఈవోపీఆర్డీ బాబూరావు చెప్పారు. ఆయన పంచాయతీలో శుక్రవారం పర్యటించి, పారిశుధ్యం పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ చెత్త తొలగించే రిక్షాలు వినియోగంలో లేనట్టు పలు పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని, అసత్యమని స్పష్టం చేశారు. పంచాయతీలో రోజూ సేకరించిన చెత్తాచెదారాన్ని సిబ్బంది రిక్షా ద్వారా శివారులో కేటాయించిన ప్రదేశంలో డంపింగ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మండల వ్యాప్తంగా 18 పంచాయతీల్లో అందించిన చెత్త తొలగించే రిక్షాలను వినియోగంలో ఉన్నాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో రెండు రిక్షాలను కేటాయించినట్టు తెలిపారు. గ్రామాల్లో అపారిశుధ్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నాడు-నేడుతో విద్యాలయాల అభివృద్ధి



మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజా ప్రతినిధులు



సింగంపల్లి పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

చింతూరు: స్థానిక జూనియర్ కళాశాలలో రూ.9లక్షలతో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళీ, ఎంపీపీ సవలం అమల శుక్రవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న నాడు-నేడు ద్వారా విద్యాలయాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీ సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ముత్తమ్మ, సర్పంచ్ కన్నారావు, మండల పార్టీ కన్వీనర్ రామలింగారెడ్డి, కృష్ణ, బాబూరావు, సీతారామయ్య, రాంబాబు, చంద్రయ్య, రాంప్రసాద్, ప్రిన్సిపాల్ రఘురాం పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: సూరంపాలెం ఎంపీపీ పాఠశాల, శరభవరంలోని ఎంపీయూపీ , రాజవొమ్మంగిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, సింగంపల్లిలోని ఎంపీపీ పాఠశాలల్లో నాడు-నేడు పనులను ఎంపీడీవో బాపన్నదొర శుక్రవారం పరిశీలించారు. నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓ తాతబ్బాయిదొర, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.